క్లుప్తంగా

సురక్ష శిబిరం సద్వినియోగం చేసుకోండి



తెనాలిఅర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌లను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, 22వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ షేక్ దుబాయ్‌బాబు పేర్కొన్నారు. మారీసుపేట మఠం బజార్‌లో అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. స్పెషలిస్ట్ వైద్యులు రోగులకు వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్య సంరక్షణకు ఈ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జనరల్ ఓపీ 115, ఆర్థోపెడిక్ 60, ఆప్తామాలజీ 72, జనరల్ మెడిసిన్ 76 మందిని పరీక్షించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి సీహెచ్ ప్రభాకర్‌రెడ్డి, ఆరోగ్య విస్తరణాధికారి అండె బాలచంద్రమౌళి, శ్రీకంఠ ఉమాకాంత్, వినోద్‌బాబు, మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వృత్తిలో వస్తున్న మార్పులను గమనించండి



తెనాలిఅర్బన్: వృత్తిలో వస్తున్న మార్పులు అందరూ గమనించాలని అరుణజ్యోతి డిస్ట్రిబ్యూటర్ కొత్త శేషుకుమార్ సూచించారు. సుల్తానాబాద్ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని కుమార్ పంప్స్ కార్యాలయంలో గురువారం ప్లంబర్‌లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వృత్తిలో వస్తున్న మార్పులను తెలియజేసి వాటిని అందిపుచ్చుకోవాలని సూచించారు. అనంతరం వారికి కిట్లను ఉచితంగా ఇచ్చారు. కార్యక్రమంలో సర్ఫ్ పెరల్ సేల్స్ మేనేజర్ సాయి స్వరూప్, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ట సందర్భంగా అన్నదానం



తెనాలిటౌన్: రూరల్ మండలం జగ్గడిగుంటపాలెం గ్రామంలో భగీరథ సీతారామ సగర సంఘం ఆధ్వర్యంలో సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి వార్ల విగ్రహ ప్రతిష్ట వైభవంగా జరిగింది. ప్రతిష్ట సందర్భంగా మందిరం వద్ద గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొని పూజలు జరిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సగర సంఘ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నెహ్రూనికేతన్‌లో అంతర్జాతీయ కవలల దినోత్సవం



తెనాలిఅర్బన్: అంతర్జాతీయ కవలల దినోత్సవాన్ని బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో గురువారం నిర్వహించారు. పాఠశాలలో జరుగుతున్న 8 జతల కవల పిల్లలకు స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ గులాబీ పూవులు ఇచ్చి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలో 10 జతల కవల పిల్లలు విద్యను అభ్యసిస్తున్నట్లు చెప్పారు. వీరందరినీ ఒక చోట చేర్చడం మధురానుభూతిని ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో టాయిలెట్స్‌కు శంకుస్థాపన

తెనాలిఅర్బన్: బాలాజీరావుపేటలోని భవిత కేంద్రంలో నూతనంగా నిర్మించనున్న మోడరన్ టాయిలెట్స్ నిర్మాణ పనులకు 33వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ మొగల్ అహ్మద్ బేగ్ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల కోసం దీనిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సహకారంతో భవిత కేంద్రంలో మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పీఏ సునీల్, ఉపాధ్యాయులు సునీత, రజనీ, వైఎస్సార్‌సీపీ నాయకులు దేవరపల్లి భూషణం, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర రాజకీయాల్లోనే ఒక విప్లవం వలంటీర్ వ్యవస్థ

- పార్లమెంటు పరిధిలోనే ది బెస్ట్ తెనాలి
- వలంటీర్లు, అధికారులతోనే సాధ్యమైంది
- అవినీతి లేకుండా అంకితభావంతో విధుల నిర్వహణ
- రూరల్ మండల వలంటీర్లకు వందనంలో ఎమ్మెల్యే శివకుమార్



తిరుపతమ్మ, పద్మలకు సేవావజ్ర అవార్డులు ప్రదానం చేసిన ఎమ్మెలే శివకుమార్

తెనాలి: ప్రభుత్వం ఇచ్చే సంక్షేమాన్ని ఏమాత్రం అవినీతికి ఆస్కారం లేకుండా లబ్ధిదారులకు చేర్చగలిగిన వలంటీర్ల వ్యవస్థ రాష్ట్ర రాజకీయాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన గొప్ప విప్లవమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. రాజకీయాల్లో అవినీతి లేకుండా సంక్షేమం ఇవ్వటమంటే మాటలు కాదనీ, జగన్మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన వలంటీర్, సచివాలయ వ్యవస్థలతోనే అది సాధ్యమైందన్నారు. తెనాలి రూరల్ మండల పరిధిలోని వలంటీర్లకు వందనం కార్యక్రమం గురువారం స్థానిక తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఎంపీడీవో కె.శిల్ప అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ, జన్మభూమి కమిటీలు చేసిన అరాచకం గత టీడీపీ ప్రభుత్వం ఓటమికి కారణాల్లో ఒకటన్నారు. ఇందుకు భిన్నంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వలంటీర్ వ్యవస్థ అద్భుతంగా పనిచేస్తూ ముఖ్యమంత్రి ఆకాంక్షను చక్కగా నెరవేర్చిందన్నారు. అంకితభావంతో పనిచేస్తున్న వలంటీర్లను లబ్ధిదారులు కుటుంబసభ్యుల్లా ఆదరిస్తున్నారన్నారు. ఇంతగా సేవలో కొనసాగుతున్న వలంటీర్లపై ప్రతిపక్ష నేతల విమర్శలను గుర్తుచేశారు. స్వాతంత్ర్యం వచ్చాక గత 76 ఏళ్లలో ఎవరూ ఇవ్వలేని విధంగా 27 వేలమందికి ఇళ్లస్థలాలను ఇచ్చామని, మరో 76 ఏళ్లకు కూడా ఎవరూ ఇవ్వలేరన్న ధీమాను వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూమి లేని తెనాలిలో ప్రైవేటు భూములు కొనుగోలు చేసి పేదలకు ఇచ్చేంత గొప్ప మనసు ఎవరికీ ఉండదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లస్థలాల్లో కాలనీలు వెలసినరోజున, రోడ్ల విస్తరణ చేసిన తన తండ్రి, మాజీ మంత్రి అన్నాబత్తుని సత్యనారాయణ గురించి చెప్పుకున్నట్టే తన గురించి కూడా ప్రస్తావించుకుంటారని వ్యాఖ్యానించారు. గుంటూరు పార్లమెంటు పరిధిలో తెనాలి నియోజకవర్గం బెస్ట్ అంటూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశీర్వదించారని చెబుతూ, ఈ విజయం తన ఒక్కడిదే కాదన్నారు. నియోజకవర్గంలోని వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, అధికారుల సమన్వయంతో పనిచేసినందునే ప్రజల అభిమానం పొందగలిగినట్టు తెలిపారు. ప్రజలకు ఇంతగా మేలు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని రెండో పర్యాయం ముఖ్యమంత్రిగా గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. గొప్ప మనసున్న ప్రభుత్వాన్ని మనందరం కూడా నిలబెట్టుకోవాలని కోరారు. సభలో అంగలకుదురు-2 వలంటీర్ బుబులోతు తిరుపతమ్మ, నందివెలుగు-2 వలంటీరు పద్మకు సేవావజ్ర పురస్కారాలను ప్రదానం చేశారు. సేవారత్న, సేవామిత్ర అవార్డులను ప్రదానం చేశారు. మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ కారుమంచి కిశోర్‌బాబు, పెదరావూరు సర్పంచ్ కాకి రమాదేవి, ఎంపీటీసీలు కాలిశెట్టి ఫణికుమార్, నాగదేవిక, నందివెలుగు సర్పంచ్ ధూళిపాళ్ల పవన్‌కుమార్ మాట్లాడారు. వైస్ ఎంపీపీ రమాదేవి, ఎంపీటీసీలు కోపల్లె సురేష్, చక్కా సీతమ్మ, గౌరికపూడి బాలరాజు పాల్గొన్నారు.

ముగిసిన జాతీయస్థాయి తృతీయ ఆహ్వాన నాటికల పోటీలు





ఉడుముల మహేష్‌రెడ్డి, లక్కరాజు లక్ష్మణరావుకు వైఎస్సార్ అచీవ్‌మెంట్ పురస్కారం

- ఉత్తమ ప్రదర్శనగా ఇంద్రప్రస్థం
- మహేష్‌రెడ్డి, లక్ష్మణరావుకు వైఎస్సార్ అచీవ్‌మెంట్ పురస్కారాలు



ఇంద్రప్రస్థం నాటికకు ఉత్తమ ప్రదర్శన బహుమతి

తెనాలి: డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి నాటక కళాపరిషత్ జాతీయస్థాయి తృతీయ ఆహ్వాన నాటికల పోటీల్లో అభినయ ఆర్ట్స్, గుంటూరు వారి ఇంద్రప్రస్థం నాటిక ఉత్తమ ప్రదర్శన బహుమతిని గెలుచుకుంది. స్థానిక తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో గురువారం రాత్రితో పోటీలు ముగిశాయి. ఉషోదయ కళానికేతన్, కట్రపాడు వారి 'విముక్తి' నాటిక ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా, శ్రీఆరాధన ఆర్ట్స్ అకాడమీ, గుంటూరు వారి క్షేత్రం నాటిక తృతీయ ఉత్తమ ప్రదర్శనగా బహుమతులు గెలుచుకున్నాయి. ఉత్తమ దర్శకుడిగా ఎస్.రవీంద్రరెడ్డి (ఇంద్రప్రస్థం), ఉత్తమ రచయితగా శిల్ప ఆకురాతి, ఉత్తమ నటుడుగా డీవీ మనోహర్ (క్షేత్రం), ఉత్తమ నటిగా సరిత (అజరామరం), ఉత్తమ క్యారెక్టర్ నటుడుగా జయశంకర్ (బహురూపి), ఉత్తమ విలన్‌గా నడింపల్లి వెంకటేశ్వర్లు (విముక్తి), ఉత్తమ సంగీతం రమణ (ఏడారిలో వాన చినుకు), ఉత్తమ రంగాలంకరణ రాము (నాలోని నీవే)కు నగదు బహుమతులు అందజేశారు. న్యాయనిర్ణేతలుగా బుర్రా నరసయ్య, రాంబాబు వ్యవహరించారు. చివరిరోజు కార్యక్రమాలకు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ జ్యోతిప్రజ్వలన చేశారు. సభలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు ఉడుముల మహేష్‌రెడ్డిని, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత లక్కరాజు లక్ష్మణరావును ఎమ్మెల్యే శివకుమార్ డాక్టర్ వైఎస్సార్ అచీవ్‌మెంట్ పురస్కారాలతో సత్కరించారు. ప్రణాళిక శాఖ ఉపకార్యదర్శి ఏవీ సుబ్బారావు, పీపుల్స్ బ్యాంక్ మేనేజర్ గంగవరపు ఆనందశర్మ, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ దేవరపల్లి మల్లిఖార్జునరెడ్డి, ఏపీ నవచైతన్య బీసీ సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు మేడిబోయిన గంగ, మాజీ సర్పంచ్ గంపల శివనాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు బండ్లమూడి భాస్కరరావు, తట్టుకూళ్ల అశోక్‌యాదవ్‌లు బహుమతి ప్రదానం చేశారు. కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి గరికపాటి సుబ్బారావు, కళాపరిషత్ నిర్వాహకులు ఆరాధ్యుల కన్నా, అద్దేపల్లి లక్ష్మణశాస్త్రి, పిట్టు కోటేశ్వరరావు, అయినాల మల్లేశ్వరరావు పర్యవేక్షించారు. తొలుత శ్రీసాయికార్తీక్ క్రియేషన్స్, కాకినాడ వారి 'ఏడారిలో వాన చినుకు' నాటికను ప్రదర్శించారు.

వైభవంగా జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు



సూర్యప్రభ వాహనంపై స్వామివారిని ఊరేగిస్తున్న దృశ్యం

తెనాలిటౌన్: షరాఫ్‌బజార్‌లో వేంచేసియున్న సువర్చల సమేత పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు గురువారం సూర్యప్రభ వాహన సేవ నిర్వహించారు. సాయంత్రం చంద్రప్రభ వాహన సేవ వైభవోపేతంగా నిర్వహించారు. వైఖానస ఆగమ పండితులు ఎంజీఎల్ రఘురామ్, వేదాంతం నాగమారుతీ, ఆలయ అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో వైదిక క్రతువు నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. పంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం సభ్యులు ఆలపించిన అన్నమయ్య కీర్తనలు అలరించాయి. శుక్రవారం సువర్చల హనుమత్ కల్యాణం, శనివారం శ్రీవారి రథోత్సవం జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి అవుతు శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్‌బీ శివ దంపతులు, నిఖిల్ కాండిల్యా దంపతులు, దాతలు గుడివాడ బాలకృష్ణ దంపతులు, గుడివాడ తిరుమల నాగమల్లేశ్వరరావు దంపతులు, కొల్లిశెట్టి లక్ష్మణరావు దంపతులు, సంకీర్తన బృందం అధ్యక్షురాలు అనురాధ, అర్చకులు కిరణ్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

భారీ మెజార్టీయే లక్ష్యం

బ్రేక్‌ఫాస్ట్ విత్ ఎమ్మెల్యేలో పార్టీ నేతలు



ఎమ్మెల్యే శివకుమార్‌ను కలిసి సిద్ధం అంటున్న పార్టీ నేతలు

తెనాలి: అసెంబ్లీ ఎన్నికలకు తెనాలి నియోజకవర్గంలో పార్టీ శ్రేణులను సిద్ధం చేసే దిశగా ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రారంభించిన 'బ్రేక్‌ఫాస్ట్ విత్ ఎమ్మెల్యే' సమావేశాలు గురువారం కొనసాగాయి. స్థానిక ఏఎస్ఎన్ ఇంజినీరింగ్ కాలేజి ఆవరణలో ఏర్పాటైన సమావేశానికి పట్టణ 17,18, 32, 35, 36 వార్డులకు చెందిన పార్టీ నేతలు, ముఖ్య కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, బూత్‌లెవల్ ఏజెంట్లు హాజరయ్యారు. పార్టీ నేతలు గొడవర్తి సాయిహరేరామ్, మట్లపూడి రాజేశ్వరరావు, సయ్యద్ గౌస్, కుక్కల ముక్తేశ్వరరావు (వాసు), ఇతర నాయకలతో కలసి ఎమ్మెల్యే శివకుమార్ బ్రేక్‌ఫాస్ట్ తీసుకున్నారు. రోజులానే వార్డుల్లో రాజకీయ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలో గరిష్టంగా పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాల లబ్ధిని చేకూర్చిన విషయం తెలిసిందే. గత నాలుగేళ్ల 10 నెలల కాలంలో దాదాపు రూ.1,800 కోట సంక్షేమ లబ్ధిని అందించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. రికార్డుస్థాయిలో పేదలకు ఇళ్లస్థలాల పంపిణీ, సంక్షేమ పథకాలతో నియోజకవర్గంలోని పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు మెరుగైన జీవనం వంటి అంశాలను ప్రతి ఇంటికీ చేర్చాలని నిర్ణయించారు. ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను వాస్తవాలతో సమర్థంగా తిప్పికొట్టాలని చెప్పారు. ప్రతి ఇంటి తలుపు తట్టి ప్రభుత్వం చేసిన మంచిని వివరించాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో గెలుపు కాదనీ, భారీ మెజారిటీని సాధించటమే లక్ష్యమని నాయకులు హామీనిచ్చారు. పార్టీ నేతలు టోపీ సుభాని, కోలా వాసు, పసుపులేటి ఆనంద్, షేక్ అన్సారీ, షేక్ ఖలీల్, షేక్ బాబు, నాగమల్లేశ్వరరావు, భరణి శ్రీనివాసరావు, ఆలమూరి ఫణి, గుర్రం కిరణ్, తాడిబోయిన పోలురాజు, తాడిబోయిన నాగార్జున, బసవయ్య, కసుకుర్తి నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయండి

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



నూతన కమిటీతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న జిల్లా అధ్యక్షుడు, పక్కన ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిఅర్బన్: త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి విద్యార్థి విభాగ నాయకులు కృషి చేయాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగాల కార్యవర్గ ప్రమాణస్వీకార మహోత్సవాన్ని కొత్తపేటలోని ఎన్‌జీవో హోమ్‌లో గురువారం రాత్రి నిర్వహించారు. విద్యార్థి విభాగ జిల్లా అధ్యక్షుడు వినోద్, పట్టణ విద్యార్థి విభాగ అధ్యక్షుడు మదిర రవితేజ, మండల విద్యార్థి విభాగ అధ్యక్షుడు చుండూరు గోపి కార్యవర్గ సభ్యులతో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ సీఎం జగన్‌కు విద్యార్థులందరూ కృతజ్ఞతలు తెలియజేయాల్సిన సమయం వచ్చిందన్నారు. పేద విద్యార్థులను కూడా కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదవించాలనే ఉద్దేశంతో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. ఆయన తనయుడు సీఎం జగన్ మరో అడుగు ముందుకు వేసి ప్రభుత్వ పాఠశాలలను నాడు-నేడు పథకం కింద తీర్చిదిద్దారని చెప్పారు. అలాగే పేద విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియం విద్యాబోధన వంటి కార్యక్రమాలతో విద్యాశాఖలో నూతన సంస్కరణలు తీసుకువచ్చారని వివరించారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అఖండ మెజారిటీని అందించాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు వినోద్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు ఎక్కడ విద్యార్థి విభాగ నియామకాలు పూర్తి కాలేదని చెప్పారు. తెనాలి పట్టణం, మండలంలో ఎమ్మెల్యే శివకుమార్ కమిటీలను ఏర్పాటు చేసి వారితో ప్రమాణస్వీకారం చేయించడం సంతోషకరమన్నారు. ఇదే స్ఫూర్తితో మిగిలిన ప్రాంతాల్లో కూడా త్వరగా కమిటీలను నియమిస్తామని చెప్పారు. ముందుగా మార్కెట్‌యార్డు నుంచి ఎన్‌జీవో హోమ్ వరకు భారీ ర్యాలీగా వచ్చారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను సన్మానించి అభినందించారు. కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు జలగం రామకృష్ణ, యలవర్తి సాంబశివరావు, ఉడుముల మహేష్‌రెడ్డి, షేక్ జిలానీ బాషా, కొమ్ము రాయల్, పెసర్లంక రమణ, టెక్స్ బాల, గౌరికపూడి బాలరాజు, కనపర్తి అనిల్, అక్కిదాసు కిరణ్‌కుమార్, కుర్రా జశ్వంత్, బూరెల దుర్గా, బండ్లమూడి భాస్కరరావు, తట్టుకుళ్ళ అశోక్‌యాదవ్ పాల్గొన్నారు.

నేటి నుంచి విశ్వయోగి విశ్వంజీ జన్మదిన వేడుకలు

ప్రత్తిపాడు: మండల పరిధిలోని చినకొండ్రు విశ్వనగర్‌లో 23నుంచి మార్చి 6 వరకు పన్నెండు రోజుల పాటు విశ్వగురు పీఠాధిపతి విశ్వయోగి విశ్వంజీ 80వ జన్మదిన వేడుకలు జరగనున్నాయని విశ్వమానవ సమైక్యతా సంసత్ కన్వీనర్ ఆకుల కోటేశ్వరరావు తెలిపారు.వేడుకల్లో పలువురు ప్రముఖులు హాజరవ్వనున్నట్లు చెప్పారు. శుక్రవారం ఉదయం అంకురార్పణతో విశ్వంజీ వేడుకల్ని ప్రారంభిస్తారని ఆయన పేర్కొన్నారు. సాయంత్రం హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం. రామచంద్రరావు, ఏపీ మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరవ్వనున్నారని కోటేశ్వరరావు తెలిపారు.

కస్తూర్బాగాంధీ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆశ్రమం



తెనాలి: ప్రపంచ ఆదర్శ మహిళ కస్తూర్బాగాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం సాయంత్రం స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మా సేవా శాంతి ఆశ్రమంలో ప్రత్యేక ఆరాధనలు నిర్వహించారు. ఆశ్రమ వ్యవస్థాపకుడు వజ్రాల రామలింగాచారి నేతృత్వంలో ఆశ్రమంలోని కస్తూర్బా, గాంధీ విగ్రహాలకు పూజలు చేశారు. తీర్థప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా నేలపాడు పరిధిలో మాతా కస్తూర్బా గాంధీ సేవాశాంతి ఆశ్రమానికి అంకురార్పణ చేసినట్టు రామలింగాచారి వెల్లడించారు.
దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో లక్షలాదిమంది త్యాగధనులు జాతిపిత గాంధీజీని అనుసరించినట్టు గుర్తు చేశారు. మహాత్ముడి అకుంఠిత దీక్ష, త్యాగం, ఆత్మవిశ్వాసానికి, ధైర్యానికి, క్రమశిక్షణకు దీటుగా నిలిచి జీవితాంతం సహాయ సహకారాలు అందించిన సహధర్మచారిణి కస్తూర్బా విశిష్టతను నేటితరానికి తెలియజేయాలనే భావనతో కస్తూర్బాగాంధీ పేరుతో ట్రస్ట్ ఏర్పాటుచేసినట్టు తెలిపారు. ఎంతో ఉన్నత కుటుంబంలో జన్మించినప్పటికీ గాంధీ మార్గంలో అతి సాధారణ జీవితాన్ని గడిపిన ఆదర్శ మహిళ కస్తూర్బా ఆశ్రమాన్ని ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. కన్నెగంటి బాపనయ్యచౌదరి, మండలి ధనుంజయరావు, వై.కోటేశ్వరరావు, ఎల్.రవి, బి.నాగభూషణరావు, విజయరత్నకుమారి, రాచపూడి సుజాతదేవి, పి.కుటుంబరావు, రాఘవయ్య శాస్త్రి పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ వీరమ్మ పేరంటాళ్లు గ్రామోత్సవం



పెదకాకాని: శ్రీ వీరమ్మ పేరంటాళ్లు తిరునాళ్ల పురస్కరించుకుని గ్రామోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈనెల 20న అమ్మవారు ఆలయం నుంచి ప్రత్యేకంగా అలంకరింపబడిన ట్రాక్టర్‌పై బయలుదేరి తక్కెళ్లపాడు చేరుకుంది. అక్కడ గ్రామోత్సవం అనంతరం తిరిగి రాత్రికి వెనిగండ్లకు చేరుకుంది. గురువారం వెనిగండ్ల పురవీధుల్లో కొమ్ము వాయిద్యాలు, డప్పుల మోత నడుమ గ్రామోత్సవం రాత్రికి పెదకాకానికి చేరుకుంది. భక్తులు అమ్మవారికి బిందెలతో నీరు వారు పోశారు. పూలు, పండ్లు, కొబ్బరికాయలు, పసుపు కుంకుమలు సమర్పించి భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. ఈనెల 25న సిడిమాను ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు గ్రూపు టెంపుల్స్ ఈఓ కోటేశ్వరరావు తెలియజేశారు.

వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

- తాడేపల్లి పట్టణ, రూరల్ కార్యాలయం ప్రారంభోత్సవం
- బైక్‌ర్యాలీ నిర్వహించిన యువకులు
- వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలసి వచ్చిన ఎంపీ విజయసాయిరెడ్డి

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి పట్టణ పరిధిలో క్రిస్టియన్‌పేట నవోదయ కాలనీలో వైఎస్సార్ సీపీ పట్టణ, రూరల్ కార్యాలయ ప్రారంభోత్సవం గురువారం రాత్రి నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల్లో నూతనోత్సాహం చోటుచేసుకుంది. నూతన పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవానికి రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, ప్రభుత్వ సలహాదారులు జూపూడి ప్రభాకర్, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా వైఎస్సార్ సీపీ పట్టణ, రూరల్ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలస్వామిరెడ్డి, మున్నంగి వివేకానందరెడ్డి, పట్టణంలోని, తాడేపల్లి రూరల్‌లోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎంపీ విజయసాయిరెడ్డి తన కార్యాలయం నుంచి ముందు కారులో ప్రాతూరు, కుంచనపల్లి క్రాస్‌రోడ్ వద్దకు చేరుకుని అక్కడ దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి, సంక్షేమ పథకాల రథసారథి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, ప్రజా నాయకులు, మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం యువకులు బైక్ ర్యాలీ నిర్వహించగా రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, నియోజకవర్గ సమన్వయ కర్త గంజి చిరంజీవిలు పాదయాత్రగా కార్యాలయానికి విచ్చేశారు. ఈ సమయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు నూతనోత్సాహంతో మంగళగిరి గడ్డ-వైఎస్సార్ సీపీ అడ్డా, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయం అంటూ నినాదాలు చేస్తూ వారివెంట పాదయాత్ర కొనసాగించారు. ఎంపీ విజయసాయిరెడ్డి, ఇతర నాయకుల రాకను పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద మహిళలు పూల వర్షం కురిపించి, హారతులు ఇచ్చి గుమ్మడికాయలతో దిష్టి తీశారు. అనంతరం రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు అమరా నాగయ్య, జేసీఎస్ కో ఆర్డినేటర్ ఈదుల మూడి డేవిడ్‌రాజు, మండల, పట్టణ ముఖ్య నాయకులు కత్తిక రాఘవరావు, కత్తిక మల్లికార్జునరావు (బుల్లబ్బాయి), మేకల సాంబశివరావు, మిరియాల రాంబాబు, బొక్కా ప్రసన్న (నాని), గేలయ్య, అప్పికట్ల సంపూర్ణ పార్వతి, ప్రకాష్, అనిల్, మహేష్, దామేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాహితీరత్న పూర్ణ ప్రజ్ఞాచారికి సత్కారం



తెనాలిటౌన్: అంతర్జాతీయ మాతృ దినోత్సవం సందర్భంగా బాపట్ల రచయిత సంఘం వారు నిర్వహించిన కవితల పోటీలో రూరల్ మండలం కొలకలూరుకు చెందిన సాహితీరత్న పూర్ణ ప్రజ్ఞాచారి పాల్గొన్నారు. బాపట్లలో విజయలక్ష్మీపురం రోటరీ కల్యాణ మండపంలో గురువారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి కవితా పోటీలలో పాల్గొని తన ప్రతిభను కనబరచి విజేతగా నిలిచారు. పోటీల నిర్వాహకులు తిమ్మల శ్యామ్‌సుందర్, నందిరాజు విజయ్‌కుమార్, డాక్టర్ జగదీష్, శ్రీధర్, తదితరులు పూర్ణా ప్రజ్ఞాచారిని ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా పూర్ణ ప్రజ్ఞాచారిని కొలకలూరు గ్రామంలోని కళాకారులు, పెద్దలు అభినందించారు.